బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వేలాదిగా తరలిరావాలి

- ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్

సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాంచందర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు

త్రిపురారం, ఏప్రిల్ 15 : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలిరావాలని ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అనంతరం సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామెర్ల జానయ్య, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు మడుపు వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ జయరాంనాయక్, వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకన్న, డైరెక్టర్ మట్ట వెంకటరెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, బైరం కృష్ణ, సుశీల్‌నాయక్, దస్తగిరి, సయ్యద్, చింతకాయల యాదయ్య, కలకొండ వెంకటేశ్వర్లు, చందునాయక్ పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

మునుగోడు : బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పగిళ్ల సతీశ్ పిలుపునిచ్చారు. మంగళవారం సభకు సంబంధించిన వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని ఆయన మండల కేంద్రంలో ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో తిరిగి కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. సభకు అధిక సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

బీఆర్ఎస్వీ పాదయాత్రలో మండల యువకులు

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో మండల నాయకులు

చండూరు, ఏప్రిల్ 15: ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కోరుతూ వలిగొండ మచ్చగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం నుంచి యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వరకు బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్‌వై ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రలో కూసుకుంట్ల యువసేన మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నక్క సుధీర్ ఆధ్వర్యంలో పలువురు యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో సబ్బండ వర్గాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణ ప్రజలు మళ్లీ సంతోషంగా ఉండాలంటే మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు ప్రజలు పెద్ద ఎత్తున్న తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

చర్లగూడెం భూ నిర్వాసితులకు చింతపల్లిలో పునరావాసం

వర్కాలలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీదేవి

మర్రిగూడ, ఏప్రిల్ 15 : మండలంలోని శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు గ్రామమైన చర్లగూడెం బాధితులకు చింతపల్లి మండలంలోని వర్కాలలో పునరావాసం కల్పించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మంగళవారం చండూరు ఆర్డీఓ శ్రీదేవి, ఇరిగేషన్ శాఖ ఈఈ రాములునాయక్ ఆధ్వర్యంలో ముంపు బాధితులతో కలిసి 40 ఎకరాల భూమిని పరిశీలించారు. భూమి పూర్తి వివరాలను సేకరించి 20 రోజుల్లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేస్తామని బాధితులకు వారు హామీ ఇచ్చారు. అయితే వర్కాల వద్ద భూమి కేటాయించడంపై భూనిర్వాసితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చింతపల్లి మండలంలోని మదనాపురం గేటు వద్ద భూమి కేటాయిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, ఇప్పుడు వర్కాల వద్ద కేటాయించడం సరికాదని పేర్కొంటున్నారు. ఇప్పటికీ 5సార్లు ఆర్ అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ పురోగతి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి నిర్వాసితులకు మదనాపురం లోనే పునరావాసం కల్పించాలని లేనిపక్షంలో ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కట్టంగూర్, ఏప్రిల్ 15 : ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, అర్హులైన వారికి పింఛన్లు, ఇండ్ల స్థలాలు, రైతు భరోసా, రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట పాదయాత్ర మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం తాసీల్దార్ గుగులోతు ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేటికి అమలుకు నోచుకోలేదన్నారు. అయిటిపాముల లిఫ్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, నాయకులు వంటెపాక వెంకటేశ్వర్లు, కుమ్మరి శంకర్, ఇటికాల సురేందర్, కట్ట బక్కయ్య, గుడుగుండ్ల రామకృష్ణ, చిలుముల రామస్వామి, మురారి మోహన్, గడగోజు రవీంద్రాచారి, జాల రమేశ్, ఊట్కూరి సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి : ఎంఈఓ

ఏజెన్సీలకు వంటసామగ్రి అందిస్తున్న ఎంఈఓ

దామరచర్ల, ఏప్రిల్ 15 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఎంఈఓ బాలాజీనాయక్ వంట ఏజెన్సీ సభ్యులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలలకు ప్రధానమంత్రి పోషణ్ అభియాన్ పథకం కింద మంజూరైన వంట సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలలకు మధ్యాహ్నభోజనాలకు అవసరమయ్యే వంట సామగ్రిని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పూల శ్రీనివాస్, పులగం రాధిక, కాశీయాదవ్, వీరయ్య పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహనకే పోషణ్ అభియాన్

- సీడీపీఓ హరిత

అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ హరిత

నీలగిరి, ఏప్రిల్15 : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించడమే పోషన్ అభియాన్ లక్ష్యమని నల్లగొండ సీడీపీఓ హరిత అన్నారు. మంగళవారం రామగిరి అంగన్‌వాడీ కేంద్రం లో గాంధీనగర్, రామగిరి, మాన్యంచెల్క అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషన్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, జయమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో చెత్తకుప్పలు

- లోపించిన పరిశుభ్రత.. ఇబ్బందులు పడుతున్న రోగులు

ప్రభుత్వ ఆస్పత్రిలో దర్శనమిస్తున్న చెత్తకుప్ప

నీలగిరి, ఏప్రిల్ 15 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడే చెత్త, ఆహార, ఆస్పత్రి వ్యర్థాలను పడవేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దాంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే రోగం నయమవడం దేవుడెరుగు కొత్త రోగాలు వచ్చేలా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆస్పత్రిలో శానిటేషన్‌ను పట్టించుకోక పోవడంతో ఈ పరిస్థితి నెలకొందని రోగులు పేర్కొంటున్నారు. దానికి తోడు ఆస్పత్రిలో మూత్రశాలలను కూడా శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయని రోగుల సహాయకులు చెబుతున్నారు. దాంతో ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకుంటుండడంతో పరిసరాలు సైతం కంపు కొడుతున్నాయి. అధికారులు స్పందించి ఆస్పత్రిలో శానిటేషన్‌ను మెరుగు పర్చాలని వారు కోరుతున్నారు.

బీఆర్ఎస్ మండల అడ్‌హక్ కమిటీ ఎన్నిక

త్రిపురారం, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ మండల అడ్‌హక్ కమిటీని మంగళవారం ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా పామోజు వెంకటాచారి, సభ్యులుగా కామెర్ల జానయ్య, మడుపు వెంకటేశ్వర్లు, ధనావత్ సుశీల్‌నాయక్, రాయినబోయిన వెంకన్న, జొన్నలగడ్డ వెంకట్‌రెడ్డి, గుండెబోయిన వెంకన్నయాదవ్, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బైరం కృష్ణ, కోట ఎల్లేశ్, కొనకంచి సత్యనారాయణ, పానుగోతు బుడ్డానాయక్, మజ్జిగపు వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. మండల కమిటీ ఏర్పాటయ్యే వరకు అడ్‌హక్ కమిటీ కొనసాగుతుందని రాంచందర్‌నాయక్ తెలిపారు.

విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, ఏప్రిల్ 15: రాష్ట్రంలో విద్యా హక్కు చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. మంగళవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత విద్యను అందించేలా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ఉచిత విద్య అందించాలనే నిబంధనలు ఉన్నా కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలు అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రెగ్యులేషన్ కమిటీ ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని మృతదేహం

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 15: వేప చెట్టుకు టవల్‌తో ఉరివేసుకొని ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని వేప చెట్టుకు మృతదేహం వేలాడుతూ ఉందని పశువుల కాపరి మిర్యాలగూడ రైల్వే స్టేషన్ మాస్టర్‌కు, పోలీసులకు సమాచారం అందించాడు. దాంతో అక్కడికి చేరుకున్న రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య మృతదేహాన్ని కిందికి దించారు. 30నుంచి 35 ఏండ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు రెండు మూడు రోజుల క్రితం టవల్‌తో ఉరి వేసుకున్నట్లు గుర్తించారు. మృతదేహం పక్కన ఉన్న చొక్కాలో ఈ నెల 12న సికింద్రాబాద్ నుంచి సెరామ్(కర్ణాటక)కు వెళ్లే రైల్వే టికెట్ లభించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పానగల్‌లో చలివేంద్రం

నీలగిరి, ఏప్రిల్15. ఏఎంబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పానగల్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫౌండేషన్ చైర్మన్, మాజీ కౌన్సిలర్ అలకుంట్ల మోహన్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. దీనిని ప్రజలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పానగల్ వాసులు ఓర్సు శ్రావణ్, కుంచం సైదులు, గుండగోని శ్రీను, ఓర్సు వెంకటేశ్, గిరి, గుండగోని పాపయ్య, రోషయ్య పాల్గొన్నారు.

వెంకటరమణారావును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

ఐక్యరాజ్యసమితి విద్యామండలి సభ్యుడు వెంకటరమణారావు

రామగిరి, ఏప్రిల్ 15: విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని ఐక్యరాజ్యసమితి విద్యా మండలి సభ్యుడు వెంకరమణారావు సూచించారు. నల్లగొండలోని జీవీగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు, విదేశాలల్లో ఉన్నత విద్య వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం నల్లగొండ కోపరేటివ్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ రవీందర్ మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం విద్యార్థులకు బ్యాంకులు అందించే రుణాలు, అకౌంట్, సేవింగ్స్ వంటి అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లతితకుమారి, వైస్ ప్రిన్సిపాల్ పావని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో అగ్నిప్రమాదం..రూ.6లక్షల ఆస్తి నష్టం

అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఫర్నిచర్

నకిరేకల్, ఏప్రిల్ 15 : నకిరేకల్ పట్టణంలోని వీటీకాలనీలోని ఇంట్లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వీటీకాలనీలోని ఇంట్లో పజ్జూరి కృష్ణ తన కుటుంబంతో నివసిస్తున్నాడు. కృష్ణ సెయింట్ ఆన్స్ పాఠశాలలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ఆయన పాఠశాల డ్యూటీకి వెళ్లాడు. భార్య పిల్లలు దర్వేశిపురం వెళ్లారు. కృష్ణ దల్లి మాత్రం ఇంట్లో ఒంటరిగా ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు లేచి ఇల్లంతా వ్యాపించాయి. దట్టమైన పొగలు కమ్ముకునే సరికి కృష్ణ తల్లి బయటకు వచ్చి కేకలు వేసింది. చుట్టుపక్కల ఉన్నవారు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో పక్కనే ఉన్న మురుగుకాల్వలో పడేశారు. అనంతరం మంటలు ఆర్పేశారు. మొత్తం రూ.6 లక్షల వరకూ ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. బాధిత కుటుంబ సభ్యులను తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప, మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితాశ్రీనివాస్, కౌన్సిలర్ గడ్డం స్వామి పరామర్శించారు. బాధితులకు 50 కేజీల బియ్యాన్ని తాసీల్దార్ అందించారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీఓ

మాట్లాడుతున్న ఎంపీడీఓ శేషగిరిశర్మ

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 15 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శేషగిరిశర్మ కోరారు. మంగళవారం మండలంలోని అన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషక పక్షోత్సవంలో మాట్లాడారు. మహిళలు రక్త హీనత సమస్య నుంచి బయటపడాంటే సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.రాధిక, టీచర్లు కమల, కవిత, ఝాన్సి, సునిత పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ మధు

గుర్రంపోడ్, ఏప్రిల్ 15: బైకులు ఎత్తుకెళ్తున్న, దేవాలయాల హుండీలను పగులగొట్టి నగదు దోచుకుంటున్న దొంగల ముఠాను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పసుపులేటి మధు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న ఆరెగూడెం గ్రామంలో తిరుమలనాథ స్వామి ఆలయ హుండీ పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు నగదును ఎత్తుకెళ్లినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఆమలూరు బస్‌స్టేజీ వద్ద మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన మామిడి వెంకటేశ్, కొత్రసాయితో పాటు మరో ఇద్దరు మైనర్లు మూడు నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై అనుమానాస్పదంగా వెళ్తుండడంతో వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా తమ నేరాలను అంగీకరించారని పేర్కొన్నారు. కొప్పోలు, ఆరెగూడెం గ్రామ శివారులో నిలిపి ఉంచిన మూడు బైక్‌లను, ఆలయ హుండీ నుంచి రూ.3వేలు దొంగిలించగా వాటిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

టేకులగూడెంలో దెబ్బతిన్న నిమ్మతోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 15 : అకాల వర్షాలకు, ఈదురు గాలులకు పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పాలెం, టేకులగూడెం, వల్లభాపురం గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న నిమ్మతోటలను, వరి పొలాలను ఆయన అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదురు గాలులకు నిమ్మతోటలు నేల వాలాయని, నిమ్మ, మామిడి కాయలు రాలిపోయినట్లు తెలిపారు. దాంతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, రేకుల షెడ్లు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. నిమ్మ రైతులకు సబ్సిడీ ద్వారా మొక్కలు, డ్రిప్‌లను అందిస్తామని హామీనిచ్చారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, ఉద్యానవన అధికారి ప్రవీణ్, తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, వ్యవసాయశాఖ అధికారి ఎండీ జానిమియా, ఆర్ఐ చిరంజీవి, నాయకులు ఉన్నారు.

పభుత్వ పాఠశాలల్లో మెనూ కచ్చితంగా పాటించాలి

- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కొండమల్లేపల్లి :జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు

చందంపేట(దేవరకొండ), కొండమల్లేపల్లి,15 : ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ కచ్చితంగా పాటించాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కమిషన సభ్యులు అనంద్, శారద, జ్యోతి, భారతితో కలిసి ఆయన దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల్లోని మైనార్టీ గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహం, రేషన్ షాపులు, దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఏమైన సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆహారం విషయంలో అలసత్వం వహిస్తే చర్యలో తీసుకుంటామని హెచ్చరించారు. దేవరకొండ ఏరియా ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న భోజనాన్ని, వంటగదిని, స్టోర్‌రూంను పరిశీలించారు. రేషన్ దుకాణాలను పరిశీలించి సన్న బియ్యంపై ఆరాతీశారు. వారి వెంట డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి హరీశ్, జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఈఓ భిక్షపతి, ఆర్డీఓ రమణారెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి చత్రునాయక్, డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమశాఖ అధికారి ఖాజా నజీమ్‌అలీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ కళ్యాణ్‌చక్రవర్తి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి, మండల అధికారులు ఉన్నారు.

సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ఉద్యమించాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి

మాట్లాడుతున్న మల్లు లక్ష్మి, జూలకంటి రంగారెడ్డి

రామగిరి, ఏప్రిల్ 15 : స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా సమాజంలో నేటికీ వివక్షత, అంటరానితనం పెచ్చరిల్లుతున్నాయని, మను సంస్కృతికి, సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపు నిచ్చారు. మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక న్యాయ యాత్ర మంగళవారం నల్లగొండకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం, కులం పేరుతో దాడులు దౌర్జాన్యాలు కొనసాగిస్తూ.. మహిళలపై వివక్షను ప్రదర్శిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలందరికీ విద్యా, వైద్యం ఉచితంగా అదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణాజ్యోతి, ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యను వ్యాపారంగా మారుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేశ్

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేశ్

హాలియా, ఏప్రిల్ 15 : విద్యను వ్యాపారంగా మార్చి ఖమ్మం జిల్లాలో 9 బ్రాంచీలను ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఖమ్మం శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేశ్ ప్రభుత్వాన్ని కోరారు మంగళవారం హాలియాలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దె భవనాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు నల్లబెల్లి జగదీశ్, కోరె రమేశ్, చందు, సాయి, వర్షత్, రాకేశ్, కార్తీక్ పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

న్యూ కిడ్స్‌లో ఘనంగా ప్రమోటింగ్ డే

హాలియా, ఏప్రిల్ 15 : హాలియాలోని న్యూకిడ్స్ పాఠశాలలో మంగళవారం ప్రమోటింగ్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ప్రమోషన్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని ఎల్లారెడ్డి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన గురువులకు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యాదయ్య, పరమేశ్వరి, బ్రహ్మాచారి, పద్మ, రమ, నాగరాణి, శంకర్, రాజేశ్వరి, కరుణ, గీత, సాగర్, రాములు, శివశంకర్, సమరసింహారెడ్డి, సందీప్, రాములు, నాగరాజు, సైదులు పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

నిడమనూరు, ఏప్రిల్ 15 : ప్రేమించిన వ్యక్తి మోసం చేయడంతో ఆత్మహత్య చేసుకున్న మండలంలోని బొక్కమంతలపాడు గ్రామానికి చెందిన మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ఆమె మృతదేహంతో ప్రధాన రహదారిపై గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. బొక్కమంతలపాడు గ్రామానికి చెందిన కుక్కల జాన్‌రెడ్డి హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని రీహాబిలిటేషన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మల్లీశ్వరి సరూర్‌నగర్‌లోని హాస్టల్లో ఉంటూ నిమ్స్ దవాఖానలో నర్సుగా పని చేస్తున్నది. ఇద్దరి మధ్య పరిచయం కాస్తా ప్రేమగా మారగా కొంత కాలం సహజీవనం చేశారు. ఇటీవల జాన్‌రెడ్డి మరోయువతిని వివాహం చేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మల్లీశ్వరి ఆదివారం హాస్టల్లోనే ఆత్మహత్య చేసుకుంది. తన మృతికి జాన్‌రెడ్డి, కుటుంబలే కారణమని సూసైడ్ నోట్‌లో రాసి పెట్టడంతో కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సోమవారం సాయంత్రం తల్లిదండ్రులకు అప్పగించారు. మల్లీశ్వరి మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం ప్రధాన రహదారిపై టెంట్‌వేసి మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. హాలియా సీఐ జనార్దన్ గౌడ్ నచ్చజెప్పినా వినకుండా ఆందోళన చేపట్టారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అక్కడికి చేరుకొని సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదు చేయిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.